త్వరలో అభ్యర్థిని ప్రకటిస్తాం

దళి సంఘాల రాష్ట్ర నాయకులు సుందర్ కుమార్

భీమవరం రూరల్: నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిగా ఎస్‌సి అభ్యర్థికి సీటు కేటాయించాలని దళిత సంఘాల రాష్ట్ర నాయకులు గంటా సుందర్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక రాజ్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసాపురం పార్లమెంట్‌లో ఎస్‌సిలకు ఒక్క రిజర్వ్ సీటు లేదని, దళితులకు గానీ దళిత క్రైస్తవులకు గానీ కేటాయించాలని, అన్ని పార్టీలతో పాటు వైసిపిని కూడా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. 2014లో వంకా రవీంద్రనాథ్, 2019 కనుమూరి రఘురామ కృష్ణంరాజుకు దళితులు, దళిత క్రైస్తవులు అండగా నిలిచారని తెలిపారు. పార్లమెంట్ అభ్యర్థి సీటును ఎస్‌సి దళిత క్రైస్తవులకు కేటాయించాలని కోరుతున్నామన్నారు. పార్లమెంట్‌లో ఒక్క అసెంబ్లీ సీటు కూడా లేదని, అందుకే ఎంపీకి అడుగుతున్నామన్నారు. విషయాన్ని ముఖ్యమంత్రికి, నేతలందరికీ తెలియజేస్తామని, స్పందించని పక్షంలో తమ అభ్యర్థి పోటీ చేస్తారని తెలిపారు.

అడియాశల బడ్జెట్..!

వైసిపి ప్రభుత్వం తన పదవీకాలంలో చివరిగా ప్రవేశ పెట్టిన ఓటన్ అకౌంట్ బడ్జెట్ జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి నిధుల కేటాయింపుపై అంకెల గారడీ ప్రదర్శించి గతం మాదిరిగానే బురిడీ కొట్టించింది. సాగునీటి ప్రాజెక్టులు, డెల్టా ఆధునికీకరణ పనులు, నిర్వాసితులకు ఇచ్చిన హామీలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహకాలకు నిధులు ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అరకొరగానే కేటాయించింది. ఈ నిధులనూ చాలా పరిమితంగానే ఖర్చు చేసింది. ఈ నేపథ్యంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ అరకొర కేటాయింపులతో జిల్లావాసులు తీవ్ర నిరాశకు గురయ్యారు.



ఎన్నికల వేళ అరకొర కేటాయింపులతో మమ

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి నిధుల కేటాయింపుపై స్పష్టత కరువు

గత బడ్జెట్లో కేటాయింపులు అరకొరే.. ఖర్చు చేసింది కొసరే

పోలవరం నిర్వాసితులకు మొండిచెయ్యి

ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహకాలు నామమాత్రమే

ప్రజాశక్తి - భీమవరం

సంక్షేమం తప్ప జిల్లా అభివృద్ధిని మరిచిన వైసిపి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో వైసిపి ప్రభుత్వం చివరి బడ్జెట్‌లోనైనా జిల్లాలోని ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు భారీగా చేస్తారని ఆశించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాను అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తారని ఆశించినప్పటికీ ఆ ఆశలు ఆవిరయ్యాయి. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక శాఖామంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కేవలం గతం మాదిరిగానే అంకెల గారడీతో మాట్లాడడం తప్ప నిధుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. గత బడ్జెట్లో కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో ఖర్చు చేసిన పరిస్థితి లేదు. 2008లో చింతలపూడి ప్రాజెక్టును రూ.1,701 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాలకు విస్తరించి 4,80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా మార్చింది. ఇప్పటివరకు భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయలేదు. గడిచిన బడ్జెట్లో రూ.272 కోట్లు కేటాయించినా చేసిన ఖర్చు నామమాత్రమే. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రెట్టింపై రూ.9,800 కోట్లకు చేరినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు నాలుగు వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. ఈ ఖర్చు కూడా గత ప్రభుత్వాల హయాంలోనే జరిగింది. ఈ బడ్జెట్లో కనీసం రూ.1500 కోట్లు కేటాయిస్తే పనులు ముందుకు సాగే పరిస్థితి ఉంది. అయితే వైసిపి ప్రభుత్వం బడ్జెట్లో దీనిపై కనీసం దృష్టి సారించలేదు. తాడిపూడికి గత బడ్జెట్లో రూ.22 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు. పనులేవీ ముందుకు సాగలేదు. ఎర్రకాలువ రిజర్వాయర్, తమ్మిలేరు రిజర్వాయర్ పనులకు సంబంధించి గత బడ్జెట్లో రూ.8.43 లక్షలు మాత్రమే కేటాయించారు. ఈ బడ్జెట్లో కేటాయింపులపై స్పష్టత లేదు.



డెల్టా ఆధునీకరణపై దృష్టి ఏది

వైసిపి ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణపై కనీసం దృష్టిసారించిన పరిస్థితి లేదు. ఉమ్మడి జిల్లాలో దాదాపు పది లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. 11 ప్రధాన కాలువలు 300కుపైగా పిల్ల కాలువలు ద్వారా సాగునీరు సరఫరా అవుతుంది. 2007లో ఉమ్మడి జిల్లాకు రూ.1416 కోట్లతో డెల్టా ఆధునికీకరణకు ఆమోదం తెలిపింది. అయితే వైసిపి ప్రభుత్వం వచ్చాక డెల్టా ఆధునికీకరణ పనులను పూర్తిగా పక్కన పెట్టేసింది. గతేడాది బడ్జెట్లో జిల్లాకు కేవలం రూ.12 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇవి కూడా రకరకాల కారణాలతో పూర్తిస్థాయిలో ఖర్చు చేసిన పరిస్థితి లేదు. తూడు, గుర్రపుడెక్క పేరుకుపోవడమే కాకుండా, వర్షాలు తుపాన్లు సంభవించిన సమయంలో ప్రతియేటా వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్న పరిస్థితి. దీనికి తోడు జల వనరులు సమృద్ధిగా ఉన్న జిల్లాలో సాగునీటి ఎద్దడి సమస్యతో రైతులు సతమతమవుతున్నారు.

'పోలవరం'పై ప్రభుత్వానికి చిన్నచూపు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలోనూ, నిర్వాసితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. తాము అధికారంలోకి వస్తే పోలవరం నిర్వాసితులకు ఇస్తున్న రూ.6.25 లక్షల పునరావాస ప్యాకేజీని రూ.10 లక్షలకు పెంచుతామని, 2006కు ముందు సేకరించిన భూములకు రూ.5 లక్షలు ఇస్తామని, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఇస్తామని, ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని, భూములకు భూములు ఇస్తామని వైసిపి చెప్పింది. కాపర్ డ్యామ్ నిర్మాణం పూర్తి చేయడంతోపాటు ప్రతియేటా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 107 గ్రామాల్లో 20 వేల కుటుంబాలు గోదావరి వరద ముంపు బారిన పడుతోంది. అయితే నిర్వాసితుల సమస్యలతోపాటు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన వైసిపి ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌లో కూడా నిర్వాసితులకు మొండిచెయ్యే చూపిందనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ప్రకటనలు ఫుల్.. పనులు నిల్!

వైసిపి ప్రభుత్వం నాలుగున్నరేళ్ల కాలంలో హడావిడి పర్యటనలు, శంకుస్థాపనలు, ప్రకటనలకే పరిమితమైంది. పనులు చేపట్టి ముందుకు తీసుకెళ్లడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్, కొల్లేరులోకి సముద్ర నీరు ఎగదన్నకుండా మూడు రెగ్యులేటర్ల నిర్మాణం, దగ్గులూరు మెడికల్ కళాశాల నిర్మాణం అన్నీ ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఉమ్మడి జిల్లాకు తలమానికమని చెప్పుకునే ఆక్వా యూనివర్సిటీని ప్రారంభించినా భవనాల నిర్మాణం నేటికీ పూర్తి చేయలేదు.

రైతులకు ప్రోత్సాహకాలపై నోరు మెదపని బడ్జెట్..

జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు, లక్షన్నర ఎకరాల్లో పామాయిల్, దాదాపు రెండు పంటల కింద పది లక్షల ఎకరాల్లో వరి సాగవుతున్నాయి. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీని కుదించడం, సీడ్, ఫీడ్ ధరలు పెరిగిపోవడం, రొయ్యల ధరల తగ్గిపోవడంతో ఆక్వా సాగు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ బడ్జెట్‌లో ఆక్వా రైతులను ఆదుకునేలా ఎటువంటి ప్రోత్సాహకాలూ లేవు. పామాయిల్ రైతుల పరిస్థితీ ఇంతే. ముఖ్యంగా వరి రైతుల పరిస్థితీ అగమ్యగోచరంగా ఉంది. ఈ బడ్జెట్‌పై వరి రైతుల పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయి. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్ జిల్లా అభివృద్ధికిగాని, సమస్యల పరిష్కారానికిగాని దోహదపడేలా లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఆశాలపై నిర్బంధం

విజయవాడ ధర్నాకు వెళ్తుండగా ఎక్కడికక్కడ అరెస్టులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తమ న్యాయమైన డిమాండ్లను జగనన్నకు తెలిసేలా విజయవాడలో ధర్నాకు బయల్దేరిన ఆశా వర్కర్లను బుధవారం సాయంత్రం టుటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు 21 మందిని టుటౌన్ పోలీస్ స్టేషన్లో సుమారు మూడు గంటలకుపైగా నిర్బంధించారు. ఈ విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, నాయకులు ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్ పోలీస్ స్టేషన్ చేరుకుని అరెస్ట్ చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ పోలీస్ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. ఆశాల న్యాయమైన డిమాండ్లను పరిశీలించాలని కోరారు.

భీమవరంలో పోలీస్‌స్టేషన్లో ఆశావర్కర్‌తో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

తణుకులో నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గణపవరం: సిఐటియు మండలాధ్యక్షుడు మేడిశెట్టి పెంటారావును అప్పన్నపేటలో ఆయన స్వగృహం వద్ద పోలీసులు గృహనిర్బంధం చేశారు. గురువారం విజయవాడ ధర్నాకు వెళ్లరాదని హెచ్చరించారు. మండలంలో పలువురు ఆశాలకు విజయవాడ ధర్నాకు వెళ్లొద్దంటూ నోటీసులు అందజేశారు.

తణుకు రూరల్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ ధర్నాకు వెళ్తున్న ఆశాలపై నిర్బంధం సిగ్గుచేటని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విమర్శించారు. మంగళవారం రాత్రి 11 గంటలకు ప్రతాప్‌కు, జిల్లా ఉపాధ్యక్షులు అడ్డగర్ల అజయ కుమారి, గార రంగారావు ఇళ్లకు పోలీసులు వెళ్లి విజయవాడ ధర్నాకు వెళ్లొద్దని నోటీసులు అందజేశారు. వారి కదలికలపై నిఘా పెట్టారు.

తాడేపల్లిగూడెం టౌన్: విజయవాడ ధర్నాకు బయల్దేరిన పలువురు ఆశాలను తాడేపల్లిగూడెం పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. ఈ విషయం తెలియగానే సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అక్కడికి చేరుకుని ఆశాలకు సంఘీభావం తెలిపారు. అరెస్టు చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ధర్నా చేస్తున్న కార్మికులు

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

మోడీ ప్రభుత్వం కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల16న దేశవ్యాప్తంగా కార్మిక, కర్షకులు చేపట్టిన గ్రామీణ బందు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. బుధవారం సివిల్ సప్లయ్ గోడౌన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు. వ్యవసాయాన్ని కాంట్రాక్టీకరణ చేసి కార్పొరేట్ వ్యవస్థకు అప్పగించే విధానాల్ని వ్యతిరేకించాలని కోరారు. భవిష్యత్తులో వ్యవసాయం సంక్షోభంలో కూరుకు పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు మూతపడి నిరుద్యోగం పెరుగుతుందన్నారు. సంపన్నులు మరింత సంపన్నులుగా తయారవుతున్నారని, పేదలు మరింత పేదలుగా క్షీణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే బడ్జెట్లో పేదలకు ఇస్తున్న సబ్సిడీలు కుదించారని రానున్న ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలని, లేనిపక్షంలో ఆకలి బాధలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక ధరలు అరికట్టే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సామంతుల ఉదయ భాస్కరరావు, కంకణాలు రంగారావు, బైరెడ్డి రాము, ఇసంపల్లి శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.

జీతం మూరెడు.. చాకిరీ బారెడు..!

యాప్‌లు, సర్వేలతో పనిభారం - ఆశాల నిర్బంధం - సమస్యలు పరిష్కరించాలని నేడు విజయవాడలో ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం

ఏవండీ మీ ఆరోగ్యం ఎలా ఉంది.. మందులు వేసుకున్నారా.. ఆరోగ్యం బాగోలేకపోతే దగ్గర్లోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చూపించుకోండి.. పరీక్షలు చేయించుకుని డాక్టర్ చెప్పిన మందులు వాడండి.. ఇలా గర్భిణుల నుంచి బాలింతలు చిన్న పిల్లలు, వృద్ధుల వరకూ అందరినీ పలకరిస్తూ నిత్యం ప్రజలతో మమేకపోతున్న ఉద్యోగులు ఆశా కార్యకర్తలు.. వారు ప్రభుత్వ వైద్య సేవలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ముందుకెళ్తున్నారు. అయితే తాము చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించకుండా చిన్నచూపు చూస్తోందని ఆవేదన చెందుతున్నారు. జీతం పెరిగిందని ఆనందిస్తున్న సమయంలో యాప్‌ల భారం పెంచారని, శక్తికి మించి పనులు చేయిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికి దగ్గర్లోని పిహెచ్‌సిలో, సచివాలయంలో పనులు చేయిస్తున్నారని, ఇంకా ఆన్‌లైన్ పనులు కూడా చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం డిసెంబర్ 14, 15 తేదీల్లో భీమవరం కలెక్టరేట్ వద్ద ఆశాలు చలిలో దీక్ష చేశారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఈ నెల 8వ తేదీన చలో విజయవాడకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఆశాలకు పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులు నోటీసులిచ్చి భయపెడుతున్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ఆశాలు వైద్య సేవలందించారు. అయితే వారికి ఉద్యోగ భద్రత, ఆరోగ్యానికి ఇన్సూరెన్స్ లేకుండా పోవడంతో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి నష్టపరిహారమూ రాలేదు. సాధారణ ప్రజలు చనిపోతే ప్రభుత్వం నుండి రూ.50,000 వచ్చాయని, ఆశాలు చనిపోతే ఒక్క రూపాయి కూడా రాలేదని వారు ఆవేదన చెందుతున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత జీతం పెంపుతో పాటు సేవలు పెంచిందని, పనికిరాని ఫోన్లు ఇచ్చి సర్వేలు చేయిస్తున్నారని వాపోతున్నారు. గతంలో ఆశాల నైపుణ్యాన్ని మెరుగుపర్చడానికి తడికలపూడిలో ఆరు నెలలకోసారి శిక్షణ ఇచ్చేవారు. ప్రస్తుతం శిక్షణ నిలిపివేసింది. యాప్‌లో లాగిన్ అవ్వాలని, లేటయితే డిఎంహెచ్‌ఒ కార్యాలయం నుంచి ఫోన్లు వస్తాయని అంటున్నారని ఆవేదన చెందుతున్నారు. గ్రామ సచివాలయంలో నిత్యం హాజరవ్వాలని, తమకు సంబంధం లేని పనులు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోతున్నారు. నరసాపురం అర్బన్ పిహెచ్‌సిలో తగినంత స్టాఫ్ లేకపోవడంతో ఆశా కార్యకర్తల చేత ఓపిలు కూడా రాయిస్తున్నట్లు సమాచారం. నరసాపురం, మరోపక్క అర్బన్ పిహెచ్‌సిలో వైద్య సేవలను ఆన్‌లైన్ చేయాలని వైద్య సిబ్బంది ఆశాలపై ఒత్తిడి గురి చేస్తున్నారు. 60 సంవత్సరాలు పూర్తయినా వారికి ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడా రావడం లేదు. దీంతో వారి జీవితం ప్రశ్నార్థంగా మారింది.

ఆశా కార్యకర్తలు

జిల్లాలో ఆశాల సంఖ్య :
1404 మంది
పిహెచ్‌సిలు : 34
అర్బన్ పిహెచ్‌సిలు : 18
సిహెచ్‌సిలు :3
ఎహెచ్‌సిలు : 4
జిల్లా ఆసుపత్రి :1

ఆశాల డిమాండ్లు ఇవే..

1.కనీస వేతనం చెల్లించాలి.
2.కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలి.
3.ప్రభుత్వం సెలవులు, మెడికల్ లీవులు, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు అమలు చేయాలి.
4.సంబంధం లేని పనులు చేయించరాదు. నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలి. శిక్షణ ఇవ్వాలి.
5.రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. ఏ కారణంతో మరణించినా మట్టి ఖర్చులు ఇవ్వాలి.
6. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలి.
7.రిటైర్మెంట్ వారి, మరణించిన కుటుంబాల్లో అర్హులైన వారిని ఆశా కార్యకర్తలుగా తీసుకోవాలి.
8.ప్రభుత్వ సంక్షేమ పథకాలను కచ్చితంగా అమలు చేయాలి.
9.కరోనా కాలంలో 2020 మార్చి నుంచి మరణించిన వారికి పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.
10. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి.
11.ఎఎన్ఎం, జిఎన్ఎం ట్రెయినింగ్ పొందిన ఆశా వర్కర్లకు ఎఎన్ఎం, హెల్త్ సెక్రటరీ, స్టాఫ్ నర్స్ నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలి.

నోటీసులిచ్చి భయపెడుతున్నారు..

దిగుపాటి జ్యోతి, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి

విధుల్లో ఉన్న ఆశా కార్యకర్తలకు పోలీసులు నోటీసులిచ్చి భయపెడుతున్నారు. హౌస్ అరెస్ట్‌లు, నోటీసులతో ఉద్యమాన్ని ఆపలేరు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు లేదా? వచ్చిన జీతంలో రూ.మూడు నుంచి రూ.నాలుగు వేలు పెట్రోల్ ఖర్చులకే సరిపోతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులని సంక్షేమ పథకాలు నిలిపివేస్తున్నారు.

కనీస గుర్తింపు లేదు..

చింతపల్లి లక్ష్మి, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలి. వివిధ యాప్‌లు, వివరాల నమోదు, సర్వేల పేరుతో పనిభారం పెంచారు. 18 ఏళ్లుగా సేవలందిస్తున్నా కనీస గుర్తింపులేదు. మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి. క్షేత్రస్థాయిలో మా పరిస్థితి అధ్వానంగా మారింది.

పాలకుల మాటలు నీటి మూటలే..

మహ్మద్ షేరిన్ బేగం, ఆశా యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి

ప్రభుత్వం ఆశాలను ఆదుకోవాలి. సేవలను గుర్తించి శ్రమకు తగిన గుర్తింపు ఇవ్వాలి. భీమవరంలో చలిలో దీక్ష చేపట్టిన ప్రభుత్వం స్పందించడం లేదు. బీమా సౌకర్యం కల్పించాలి. సమస్యలు పరిష్కరిస్తామని పాలకులు చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలాయి.

పని భారం తగ్గించాలి

ఎస్.లారెన్స్ కుమారి, ఆశా యూనియన్ జిల్లా కోశాధికారి

ఆరోగ్య శాఖ నుంచి ఏ ప్రభుత్వ పథకం వచ్చినా క్షేత్ర స్థాయికి తీసుకెళ్లేందుకు ముందుటాం. అత్యవసర సమయాల్లో సెలవులు ఇవ్వాలి. నాణ్యమైన డిమాండ్లు పరిష్కరించాలి. ఆన్‌లైన్ పనిభారం తగ్గించాలి. తగిన శిక్షణ ఇవ్వాలి. పని ఒత్తిడి ఎక్కువైంది. చేయలేకపోతున్నాం. ఇన్ని సేవలు చేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించాలి.

యాప్‌లో వివరాలు నమోదు చేసుకుంటున్న ఆశాలు

మెగా డిఎస్‌సి విడుదల చేయాలి

డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శర్మ, ధనుష్

ప్రజాశక్తి - భీమవరం

25 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 9వ తేదీన స్థానిక ప్రకాశం చౌక్ వద్ద నిరసన చేపట్టనున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శి ఎస్ఎస్‌వి.శర్మ, గేదెల ధనుష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 6,100 డిఎస్‌సి పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. సుమారు 10 లక్షల మంది అభ్యర్థులు ఉన్నారని వారందరికీ ఎలా న్యాయం చేస్తుందని ప్రశ్నించారు. జగన్ అధికారంలోకి రాక ముందు ఇచ్చిన 23 వేల మెగా డిఎస్‌సి హామీకి, ఇప్పుడు విడుదల చేసిన దగా డిఎస్‌సి సంఖ్యకు ఎక్కడా పొంతన లేదని విమర్శించారు. జిల్లాలో సుమారు 45 వేల మంది డిఎస్‌సి కోసం చూస్తుంటే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు ప్రభుత్వం అతి స్వల్పమైన సంఖ్యను ప్రకటించి చేతులు దులుపుకోవడం దుర్మార్గం అన్నారు. కేవలం ఎన్నికల ప్రయోజనం కోసం విడుదల చేసిన డిఎస్‌సిగానే కనిపిస్తోందని తెలిపారు. అలాగే గతంలో రద్దు చేసిన అప్రెంటీస్ విధానాన్ని మళ్లీ పునరుద్ధించడం సరైంది కాదని తెలిపారు. జూన్ నెలలో రిటైర్డ్ అయ్యే ఉద్యోగులతో కలిపి 25 నుంచి 30 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ చేపట్టే నిరసనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మోహనరావుకు నివాళి

ప్రజాశక్తి - ఆకివీడు

పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను ఎలుగెత్తి డప్పు కొట్టి పాటల ద్వారా సమాజానికి చాటినప్పుడే మోహనరావుకు నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. ఇటీవల మృతి చెందిన ప్రజా నాట్యమండలి డప్పు కళాకారుడు కుంచాడ మోహనరావు సంస్మరణ సభ శాంతినగర్‌లో బుధవారం మోహనరావు నివాసం వద్ద జరిగింది. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ వలీ అధ్యక్షతన జరిగిన సభలో బలరాం పాల్గొని మాట్లాడారు. కార్యక్రమం ప్రారంభంలో మోహనరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బలరాం మాట్లాడుతూ రైస్‌మిల్లు, రిక్షా కార్మికుడిగా కుటుంబాన్ని పోషించుకుంటూ ప్రజాకళల అభివృద్ధికి చివరి శ్వాస వరకూ పాటుపడ్డ మనిషి మోహనరావు అన్నారు. తనతో పాటు తన కుటుంబ సభ్యులను సైతం ప్రజా నాట్యమండలి కోసం కృషి చేసే విధంగా తయారు చేశారన్నారు. కుటుంబ సభ్యులు అందరూ కలిసి సిపిఎం ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఎలుగెత్తి చాటేవారన్నారు. సభలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు మాట్లాడుతూ ఆకివీడు కేంద్రంగా కళాకారులుగా ఉద్యమాల్లో పాల్గొని అభివృద్ధి చేశారన్నారు. నిరుపేద కుటుంబమైన తన కూతురు అల్లుళ్లను కళలకు అంకితం చేయడం శుభ పరిణామం అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు. సంస్మరణ సభలో నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు చైతన్య ప్రసాద్, పార్టీ పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, ప్రజా సంఘాల నాయకులు బి.వాసుదేవరావు, ఎం.రామాంజనేయులు, వైకుంఠరావు, ఐద్వా నాయకులు ఎస్.ఉదయకుమారి, డొకల లక్ష్మి, చిన్న పాపారావు, సందక సూరిబాబు, బి.రాంబాబు, బివి.వర్మ, కింజరపు శంకర్, పెంకి అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బలరాం

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని పెదఅమిరంలో ఎస్ఆర్‌కెఆర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన జాతీయ సేవా శిబిరం బుధవారంతో ముగిసింది. పెదఅమిరంలో వారం రోజులపాటు పారిశుధ్యం, సైబర్ క్రైమ్, స్వచ్ఛభారత్, సామాజిక సేవా కార్యక్రమాలు వంటి అంశాలపై విద్యార్థులు ప్రజలతో మమేకమై పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చరిత్ర ప్రసిద్ధి చెందిన జైన్ దేవాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.కృష్ణచైతన్య, కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీ కృష్ణంరాజు, గ్రామ పంచాయతీ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, కార్యదర్శి సునీల్ రాజు, ఎన్‌ఎస్‌ఎస్ సహాయ కో-ఆర్డినేటర్ కెఎన్‌వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఒపిఎస్ అమలు చేసేవారికే మద్దతు : యుటిఎఫ్

ప్రజాశక్తి - మొగల్తూరు

ఒపిఎస్ విధానం అమలు చేసిన వారికే యుటిఎఫ్ మద్దతు ఉంటుందని మొగల్తూరు మండలాధ్యక్షులు చింతపల్లి కృష్ణమోహన్ అన్నారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని కెపి.పాలెం గ్రామంలో ఉన్న జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒపిఎస్ విధానాన్ని అమలు చేసిన పార్టీకి మా ఓటు అంటూ కార్యక్రమం రూపొందించామన్నారు. అనంతరం గ్రామంలో వాల్‌పోస్టర్‌ను అతికించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మారావు, వి.సత్యనారాయణ, పి.కృష్ణానందం, ఉమాదేవి, శారద, మంగతాయారు, సునీత, పి.శ్రీనివాసరావు, జితేంద్ర, టిడివి.ప్రసాద్, కె.కళాకార్‌రాజు, రవి, శ్రీనివాస్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని కొడమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023లో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ప్రియాంక, సుహాసినిలకు గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను స్థానిక దాతలు కొల్లిపర వెంకన్నబాబు మనవడు కొల్లిపర తనుష్, నాగ వెంకట్ చేతులమీదగా బుధవారం అందించారు. మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు అందించారు. 1995 సంవత్సరం నుంచి పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు కొల్లిపర రామారావు మహాలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మెడల్స్ అందిస్తున్నట్లు చెప్పారు.

జాతీయ స్థాయిలో చైతన్య విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

పాలకొల్లు :దేశ వ్యాప్తంగా ఇటీవల జరిగిన రెండో దశ క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో పాలకొల్లు, పూలపల్లి శ్రీ చైతన్య సిబిఎస్ఇ విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించారు. రెండో దశకు అర్హత సాధించిన 61 మంది విద్యార్థుల్లో ఆరుగురు పాలకొల్లు విద్యార్థులు నగదు బహుమతి సాధించారు. మిగిలిన విద్యార్థులు ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు ప్రిన్సిపల్ అరుణకుమారి తెలిపారు. విద్యార్థులను ఎజిఎం పార్థసారథి, ఆర్ఐ రాజ్‌కుమార్, కో-ఆర్డినేటర్ రామారావు అభినందించారు.

తాగునీటి సమస్య నివారణే లక్ష్యం : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

తాగునీటి సమస్య నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని యండగండి రెండో సచివాలయ పరిధిలో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రూ.33 లక్షల వ్యయంతో నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత

పాలకోడేరు : గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు విస్సాకోడేరు గ్రామ సర్పంచి బొల్లా శ్రీనివాస్ అన్నారు. క్రిస్టియన్‌పేటలో రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు :స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల ఎనిమిదో తేదీ గురువారం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు దీవిస్ ల్యాబొరేటరీస్‌లో ఉద్యోగాల కోసం క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలకు కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.లక్ష్మణ్‌రావు 970139466 సంప్రదించాలని తెలిపారు.

పంట కాలువ పరిశీలన

పాలకొల్లు :పాలకొల్లు పట్టణం నుంచి మండలంలోని పెదగరువు, దిగమర్రు, పెదమామిడిపల్లి గ్రామాలకు ప్రవహిస్తున్న పంట కాలువలో చెత్త పేరుకుపోయి పంట పొలాల్లోకి నీరు రావట్లేదని రైతులు వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన బుధవారం మురుగు వెళ్తున్న పంట కాలువను పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా పంట నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

నేటి నుంచి ఎలుకల నిర్మూలన

గణపవరం :మండలంలో ఎలుకల నిర్మూలనా కార్యక్రమం ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వై.ప్రసాద్ తెలిపారు. ఎలుకల నిర్మూలనకు మండలానికి 62 కేజీల బ్రొమొడయోలిన్ మందు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎనిమిదో తేదీన గ్రామంలో రైతులందరూ వరి చేల గట్ల పైన ఉన్న ఎలుకల కన్నాలను గుర్తించాలన్నారు. తొమ్మిదో తేదీ స్థానిక ఆర్‌బికె సెంటర్ వద్ద ఎలుకల నివారణ మందులు అందిస్తారని చెప్పారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో 104 ఉద్యోగికి గాయాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

రోడ్డు ప్రమాదంలో 104లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న డి.జోషి గాయాలపాలైంది. జోషి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మొగల్తూరులో మరో ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయాపాలైన జోషిని స్థానికులు 108లో నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

బాలికను మోసగించిన వ్యక్తిపై కేసు

ఉండి :ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి బాలికను మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పాందువ్వ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన మట్టా చిట్టిబాబు మూడేళ్ల నుంచి ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆ బాలికను లోబర్చుకుని పెళ్లి చేసుకోకుండా ముఖం చాటేయడంతో బుధవారం సాయంత్రం బాలిక ఉండి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక ఫిర్యాదు మేరకు ఉండి పోలీసులు మట్టా చిట్టిబాబుపై ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళతో అసభ్య ప్రవర్తన

ఆటోడ్రైవర్‌పై కేసు

ఉండి : మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆకివీడు మండలం సిద్ధాపురానికి చెందిన మహిళ భీమవరంలో గుడిపూడికి చెందిన ఆటో ఎక్కింది. ఉండి మండలం చెరుకువాడ ప్రాంతంలో ఆటోలో ప్రయాణించే మహిళ పట్ల ఆటో డ్రైవర్ నేలపర్తి క్రిస్టియన్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. మహిళ కేకలు వేయగా ఆ కేకలు విన్న కొంతమంది యువకులు ఆటోను వెంబడించి ఆటోను ఆపి డ్రైవర్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు నేలపర్తి క్రిస్టియన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలన్

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటాలకు సిద్ధమవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. మండలంలోని మోగల్లులో బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందన్నారు. పెరుగుతున్న ధరలతో, తరుగుతున్న ఆదాయాలతో, నిరుద్యోగంతో సామాన్యులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సేశపు అశ్రియ్య, మండల కమిటీ సభ్యులు పాలా వెంకటస్వామి, దున్నా మరియమ్మ, నాయకులు గుత్తుల బాబూరావు, సానం పుత్తర సత్యనారాయణ, వీరవల్లి వెంకటేశ్వరరావు, తిలక్ పాల్గొన్నారు.

మురళికి సిపిఎం నేతల పరామర్శ

ఆకివీడు :ఆకివీడు రూరల్ బ్యాంక్ ఛైర్మన్ కేసిరెడ్డి మురళి తండ్రి కృష్ణమూర్తి ఇటీవల మృతి చెందారు. మురళిని సిపిఎం నాయకులు కె.తవిటినాయుడు, పెంకె అప్పారావు, బివి.వర్మ, సందక సూరిబాబు, శంకర్, డి.రవితేజ రాంబాబు పరామర్శించారు. కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అపరాజిత షైనింగ్ స్టార్ వామ్ అవార్డుకు కనకరత్నమాల

ప్రజాశక్తి - ఆచంట

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సీనియర్ సిటిజన్ నార్త్ మహిళ విభాగం అధ్యక్షురాలు కొత్త కనకరత్నమాల వెంకటేశ్వరరావు అపరాజిత షైనింగ్ స్టార్ వామ్ అవార్డు -2024కు ఎంపికైంది. ఈ పురస్కారాన్ని ఈ నెల పదో తేదీన చెన్నైలో నిర్వహించే వామ్ నేషనల్ ఉమెన్స్ కాన్ఫిడెన్స్‌లో అందుకోనున్నట్లు ఆమె తెలిపారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - నరసాపురం

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ వెంకటరమణ అన్నారు. స్థానిక వలవలవారివీధిలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 27వ బూత్‌లో బూత్ కన్వీనర్ అంతర్వేది సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో బుధవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరు గ్రామంలో స్వయంభూ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన భవన నిర్మాణానికి దేవస్థాన మాజీ ఛైర్మన్ అడ్డాల వెంకటగణపతిరాజు కుటుంబం రూ.లక్ష విరాళాన్ని బుధవారం అందించారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన అడ్డాల వెంకటగణపతిరాజు, వెంకట సత్యవతి దంపతుల కుమారుడు వెంకట నాగ సుబ్బరాజు, వెంకటలక్ష్మి దంపతులు కలిసి అన్నదాన భవన నిర్మాణానికి రూ.1,01,116 ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్‌కుమార్‌కి అందించారు.

హెచ్ఐవి బాధిత పిల్లలకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి భాధిత పిల్లలకు బుధవారం పౌష్టికాహారం అందించారు. పాలకొల్లు మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మానవత సభ్యులు గాది ఆంజనేయులు ఆర్థిక సహకారంతో కొత్తపేట అర్బన్ ఆరోగ్య కేంద్రంలో హెచ్ఐవి బాధిత పిల్లలకు పౌష్టికాహారం అందించారు. ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కబర్ధి పాల్గొన్నారు.

గొంతేరు డ్రెయిన్ తవ్వకాలు అడ్డగింత

నష్టపరిహారం అందించాలని రైతుల ఆందోళన

ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - మొగల్తూరు

గొంతేరు డ్రెయిన్ తవ్వకాలను బుధవారం రైతులు అడ్డుకున్నారు. మొగల్తూరు పంచాయతీ గరువుపల్లవపాలేనికి చెందిన పలువురు పేద మత్స్యకారులకు గ్రామంలోని గొంతేరు డ్రెయిన్ అవతల భాగం ముత్యాలపల్లి రెవెన్యూ పరిధిలో డ్రెయిన్‌ను ఆనుకుని భూములున్నాయి. ఈ డ్రెయిన్ తవ్వకాలకు సంబంధించి ముత్యాపల్లి రెవెన్యూ పరిధిలో 2013లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో సుమారు 45 ఎకరాలు భూ సేకరణ చేశారు. ఈ భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.12.50 లక్షలు పరిహారం అందించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అయితే ఈ భూములు కోల్పోయిన వారిలో సుమారు 15 ఎకరాలకు సంబంధించి 24 మంది రైతులకు నాటి నుంచి నేటి వరకూ నష్టపరిహారం చెల్లించలేదు. అయితే భూములు కోల్పోయిన రైతుల ఆందోళనలతో సుమారు మూడేళ్ల క్రితం డ్రెయిన్ తవ్వకాలు మాత్రం ప్రభుత్వం డబ్బులిచ్చిన భూముల్లో మాత్రమే తవ్వకాలు పూర్తి చేసి డబ్బులివ్వని భూములను తవ్వకుండా వదిలేశారు. 15 ఎకరాలకు సంబంధించి రైతులు నష్ట పరిహారం కోసం జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, డ్రెయినేజీ అధికారుల చుట్టూ తిరిగినా వీరికి నేటికీ పరిహారం అందలేదు. బుధవారం డ్రెయిన్ తవ్వకాలను నష్టపరిహారం అందని రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తిరుమాని మార్రాజు, కర్రి స్వామి, మోకా శ్రీనివాస్, వెంకట్రాజు, అద్దంకి మల్లికార్జునరావు, కొల్లాటి బాబూరావు, బర్రి వీరాస్వామి, మామిడిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సుమారు పదేళ్ల నుంచి నష్ట పరిహారం కోసం పోరాడుతున్నామని తెలిపారు.

శిథిలావస్థకు పెనుగొండ వంతెన

శిథిలావస్థకు చేరిన వంతెన

ప్రజాశక్తి పెనుగొండ

పెనుగొండ ఓవర్ బ్రిడ్జి అధ్వానంగా మారింది. అడుగడుగున గోతులమయంగా దర్శనమిస్తుం ది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఈ బ్రిడ్జిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తాయి. పెనుగొండ నుంచి రావులపాలెం, తణుకు, నరసాపురం, భీమవరం వెళ్లేందుకు ఈ ఓవర్ బ్రిడ్జి మీదుగా వెళ్లాలి. దీంతో వాహనాలు అధికంగానే ప్రయాణిస్తుంటాయి. బ్రిడ్జి అధ్వానస్థితికి చేరుకుని ఐరన్ ఊసలు బయటకు కనిపిస్తున్నాయి. తాము ఇబ్బందులకు గుర వుతామని వా హనదారులు, ప్ర యాణికులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. వంతెన గోతు లమయంగా ఉండ డంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈ వంతెనపై అధికారులు వెళ్తున్నా పట్టించుకోవడంలేదని వాహనదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సురక్షిత డ్రైవింగ్‌పై దృష్టి పెట్టాలి

తాడేపల్లిగూడెం : కుటుంబ సభ్యుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రైవర్లు సురక్షిత డ్రైవింగ్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలని తాడేపల్లి గూడెం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ నాయక్ తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం తాడేపల్లిగూడెం ఆర్‌టిసి డిపోలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సురక్షిత డ్రైవింగ్‌కి పాటించాల్సిన నియమ నిబంధనలు వివరిం చారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద జంప్ చేయకూడదన్నారు. సురక్షిత డ్రైవింగ్‌పై ఎక్కువ శ్రద్ధ పెట్టా లని వివరించారు. డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి మాట్లా డుతూ సురక్షిత ప్రయాణం ఆర్‌టిసితోనే సాధ్యమనే నమ్మకంతో ప్రయాణికులు ఆర్‌టిసి బస్సులను ఆదరిస్తున్నారన్నారు.

రాష్ట్రస్థాయిలో మాంటిస్సోరిస్ విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు రూరల్ :లిటిల్ ఛాంప్స్ తెలుగు ఒలింపియాడ్ కాంపిటేటివ్ పరీక్షల్లో ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ టాప్ 10 లోపు మూడు స్టేట్ ర్యాంకులు సాధించిందని కర స్పాండెంట్ మద్దాల వాసు తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థి డి.రూపశ్రీసాయిలక్ష్మి మొదటి ర్యాంకు, ఆరో తరగతి విద్యార్థి డి.కార్తీక్‌నాగ సాయిప్రవీణ్ ఏడో ర్యాంకు, ఎనిమిదో తరగతి విద్యార్థి కె.సాయిస్వరూప పదో ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూలులో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన వికె. సత్యనారాయణ మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.రెండు వేలు మెరిట్ స్కాలర్‌షిప్ తరపున అందించారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాలు ప్రారంభం

భీమవరం రూరల్ :యుఎస్ఎన్ఆర్ఐ వారి ఆత్మీయ సేవా సంస్థ వారి సహకారంతో చేగొండి హరిరామజోగయ్య ఆశీస్సులతో కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో మండలంలోని తుందుర్రు, గొల్లవాణితిప్ప గ్రామాల్లో ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాలను జనసేన పార్టీ ప్రొటోకాల్ ఛైర్మన్, కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లినీడి తిరుమలరావు(బాబి) చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో మొదటి విడతగా తుందుర్రు, గొల్లవాణితిప్ప గ్రామాల్లో 50 చొప్పున వంద కుట్టు మిషన్లు శిక్షణ కాలం పూర్తయిన అనంతరం అందిస్తారన్నారు.

మెగా డిఎస్‌సి నిర్వహించాలి

పాలకొల్లు :23 వేల టీచర్ పోస్టులతో మెగా డిఎస్‌సి నిర్వహించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.సుందర్, టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుందర్, టి.అప్పలస్వామి మాట్లాడుతూ జగన్ అధికారంలోకి రాక ముందు రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను పరిగణనలోకి తీసుకుని మెగా డిఎస్‌సి తీస్తామని చెప్పి ఇప్పుడు కేవలం 6100 పోస్టులతో తీయడం నిరుద్యోగ యువతను మోసం చేయడమేనన్నారు.

'రాజధాని నిర్మించకపోవడం అవివేకం'

పాలకొల్లు :. రాష్ట్రానికి ఆదాయ వనరుగా ఉన్న రాజధాని నిర్మించుకోకపోవడం అవివేకమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కొలుకులూరి అర్జున్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక 31వ వార్డులో బుధవారం విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైసిపి, బిజెపి రాజధాని నిర్మించలేకపోయాయని కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాజధాని అమరావతిలో నిర్మించడంతోపాటు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పారు. అధికారంలోకొస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని చెప్పారు.

అప్పుల బాధ తాళలేక గృహిణి ఆత్మహత్య

ఎన్ఆర్‌పి అగ్రహారంలో ఘటన

ప్రజాశక్తి - ఉండి

అప్పుల వేధింపులు తాళలేక కలుపు మందు తాగి గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామానికి చెందిన గలవిల మహేశ్వరి (45) అదే గ్రామానికి చెందిన పెదపాటి బాలకృష్ణ వద్ద ఎనిమిది నెలల క్రితం రెండు సార్లు రూ.రెండు లక్షల చొప్పున మొత్తం రూ.నాలుగు లక్షలు అప్పుగా తీసుకుంది. ఈ క్రమంలో పెదపాటి బాలకృష్ణ తనకు తెలియకుండా తనతో సంతకాలు చేయించుకుని తన ఇంటిని సేల్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని విషయం తెలుసుకున్న మహేశ్వరి రెండు నెలల క్రితం తన బంధువులతో కలిసి పెదపాటి బాలకృష్ణను అడిగింది. వడ్డీ, రిజిస్ట్రేషన్ ఖర్చులు మొత్తం కలిపి రూ.11 లక్షలు అయిందని, ఆ మొత్తం తనకు ఇస్తేనే ఇల్లు తిరిగి మహేశ్వరి పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తానని బాలకృష్ణ చెప్పాడని మహేశ్వరి ఫిర్యాదులో పేర్కొంది. ఇల్లు తిరిగి రిజిస్ట్రేషన్ చేయాలని మహేశ్వరి బంధువులు అడిగారు. దీంతో బాలకృష్ణ మహేశ్వరి వద్ద తీసుకున్న ఖాళీ చెక్కుల ద్వారా చిగురుపల్లి నాగేశ్వరరావు వద్ద రూ.15 లక్షలు మహేశ్వరి అప్పు తీసుకున్నట్లు సృష్టించి వేధించాడన్నారు.

మహదేవపట్నం గ్రామానికి చెందిన మంగ అనే మహిళ వద్ద మహేశ్వరి రూ.రెండు లక్షలు అప్పుగా తీసుకోగా ఆమె రూ.ఐదు లక్షలు తీసుకున్నట్లు బూకాయించి రూ.ఐదు లక్షలు వెంటనే ఇవ్వాలని ఒత్తిడి చేసిందన్నారు. పెదపాటి బాలకృష్ణ, మంగ ఇద్దరూ ఒకేసారి అప్పులు వెంటనే తీర్చాలని వేధింపులకు గురి చేయడంతో తట్టుకోలేని మహేశ్వరి మంగళవారం ఉదయం కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన ఆమె కుమార్తె, అల్లుడు భీమవరం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మహేశ్వరి అక్కడ అవుట్ పోస్ట్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడి చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి అదేరోజు సాయంత్రం మృతి చెందింది. అవుట్‌పోస్ట్‌లో ఆమె చేసిన ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సుమారు 30,600 సంఘాలకు లబ్ధి

స్వయం సహాయక సంఘాల డిపిఎం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఆకివీడు

వైఎస్ఆర్ ఆసరా పథకంతో జిల్లాలో ప్రస్తుతం రమారమి 30,600 స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు లబ్ధి చేకూరుతోందని స్వయం సహాయక సంఘాల జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ దాసరి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల సమాఖ్య భవనంలో బుధవారం జరిగిన మండల సంఘాల సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో 897 గ్రామ సమాఖ్యలు, 20 మండల సమక్షంలో ఉన్నాయని చెప్పారు. 17,249 సంఘాలు రుణాలు తీసుకున్నారన్నారు. స్వయం సహాయక సంఘాల జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అరుణకుమారి మాట్లాడుతూ మండలంలోని అన్ని సంఘాలకు 15వ తేదీ గురువారం మండలంలోని అన్ని సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి పివిఎల్ చేతులమీదుగా చెక్కులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు సమాఖ్య ఎపిఎం నాయుడు, సమాఖ్య కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


కాళ్ల : చెక్కు అందిస్తున్న పివిఎల్.నరసింహరాజు

కాళ్ల : మహిళా సాధికారత వైసిపి ప్రభుత్వానికే సాధ్యమని ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని పెదఅమిరం గ్రామంలో నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జగన్ ఎన్నికల హామీలో భాగంగా డ్వాక్రా రుణమాఫీ నాలుగు విడతలుగా పూర్తి చేశారన్నారు. వైఎస్ఆర్ ఆసరా పథకం నాలుగో విడత కింద మంజూరైన రూ.16,68,47,917 చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు పిళ్లంగోళ్ల శ్రీలక్ష్మి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు(వాసు), ఎంపిపి పి.శిరీషవిశ్వనాథరాజు, టిటిడి మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, ఎంపిడిఒ ఎం.ఎస్.ప్రభాకరరావు, ఎపిఎం కె.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పాలకొల్లు : గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు వైసిపి ప్రభుత్వం అన్ని విధాలా చేయూత ఇచ్చిందని పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ చెప్పారు. పాలకొల్లు వైసిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన స్వయం సహాయక సంఘాల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాలకొల్లులో వైసిపి గెలవకపోయినా ఇంత అభివృద్ధి జరిగిందంటే మళ్లీ జగన్‌ను సిఎం చేసి ఇక్కడ గోపీని గెలిపించుకుంటే ఇంకా అభివృద్ధి జరుగుతుందని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపి అర్బన్ ఫైనాన్షియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వనం కల్యాణి, పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, ఎఎంసి ఛైర్మన్ సాల దేవినరసయ్య, రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రటరీ కర్రా జయసరిత, జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ పెచ్చెట్టి కృష్ణాజీ పాల్గొన్నారు.

ఆచంట :తూర్పుపాలెంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మనసారా ఆసరా సంబరాల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ ఆచంట నియోజకవర్గంలో రూ.53 వేల కుటుంబాల ఇంటికి వెళ్లి కలుసుకుని కష్ట సుఖాలను తెలుసుకున్నట్లు చెప్పారు. నియోజకవర్గ మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పదేళ్లు ఎంఎల్ఎగా ఉన్నా డ్వాక్రా మహిళలకు చేసిందేమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ సిఎం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రాల హక్కులను హరిస్తున్న బిజెపి నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ స్థానిక ప్రకాశంచౌక్‌లో గురువారం ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు వామపక్షాలు తెలిపాయి. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఐ జిల్లా సమితి కార్యదర్శి కోనాల భీమారావు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి, ఎంసిపిఐ (యు) నాయకులు చంటి ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిరసనలో అన్ని తరగతుల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

ఉండి :సిఎం సహాయ నిధి పేద, మధ్య తరగతి ప్రజలకు వరమని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఉండిలో వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో మండలంలోని పాములపర్రు గ్రామానికి చెందిన మహిళ వర్రే ఉమామాణిక్యంబకు రూ.1.30 లక్షల విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పివిఎల్.నరసింహరాజు అందించారు.

9 నుంచి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

నరసాపురం : నులి పురుగు నివారణకు పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ వెంకటరమణ తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

'ఆ భూములకు రిజిస్ట్రేషన్ చట్టవ్యతిరేకం'

ప్రజాశక్తి - మొగల్తూరు

కాళీపట్నం భూములకు రిజిస్ట్రేషన్ కల్పిస్తామని అధికార పార్టీ నాయకులు, అధికారులు చెబుతున్న మాటలు చట్టవ్యతిరేకమైనవని ప్రకాశం ల్యాండ్ లెస్ పూర్ సొసైటీ అధ్యక్షుడు మేడిది మాధవకృష్ణారావు అన్నారు. బుధవారం ఆయన ఇంటి వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధికారులు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కాళీపట్నం భూములకు రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెబుతున్నారని, అది చట్టవ్యతిరేకమని కృష్ణారావు అన్నారు.

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, గణపవరం మండలం, అర్ధవరం గ్రామం, డోర్‌నెం. 4-66కి చెందిన **యిందుకూరి వెంకట సుబ్బరాజు S/o.యిందుకూరి సత్యనారాయణరాజు** అను నేను 6-2-2024 తేదీన నాయొక్క ఒరిజినల్ దస్తావేజులను తీసుకొని నా స్వగ్రామం అయిన అర్ధవరం నుండి గణపవరం జిరాక్స్ తీయించుటకు వెళ్ళినాను. జిరాక్స్ తీయించుకొని తిరిగి గణపవరం నుండి నా స్వగ్రామం అయిన అర్ధవరం వస్తుండగా దారి మధ్యలో పడిపోయినవి. దస్తావేజు నెంబర్. 1565/1975 దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కి తెలియజేయగలరు.

యిందుకూరి వెంకట సుబ్బరాజు, S/o.యిందుకూరి సత్యనారాయణరాజు, డోర్‌నెం.4-66, దిబ్బాలమీద, అర్ధవరం, గణపవరం మండలం, ప.గో.జిల్లా. సెల్: 9177146789

దస్తావేజు పోయినది

నాక్లయింట్ అయిన ఏలూరు జిల్లా లక్ష్మీపురం గ్రామం, పేదవేగి (మం) కు చెందిన **శ్రీ సూర్రెడ్డి వెంకటేశ్వరరావు** S/o. లక్ష్మయ్య అను వారు తెలియజేయునది ఏమనగా వారి యొక్క ఒరిజినల్ దస్తావేజు నెం. **6403/1986** రు గల తేది. **17.10.1986** గల డాక్యుమెంట్ పెదవేగి గ్రామము నందు జిరాక్స్ తీయుంచుటకు వెళ్ళుతుండగా మార్గమధ్యలో పడిపోయినది. . కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్ కు తెలియ చేయగలరు.

E.SRINIVASA BABU, Advocate
Eluru, Ph : 08812-239498

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం/ పట్టణ గ్రామస్తులు, బుంగా రాంబాబు S/o చంద్రరావు గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా.

నా క్లయింట్ జంగారెడ్డిగూడెంలో R.S.No: 356 లో చ॥గ॥ 212 లు స్థలం చాగల్లు మండలం వాస్తవ్యులు కొత్తపేట కరుణ W/o పుట్టయ్య గారి వద్ద నుండి కొనుగోలు చేసి జంగారెడ్డిగూడెం SRO లో క్రయ దస్తావేజు 448/2018 తేది. 22-1-2018 రిజిష్ట్రీ చేసుకొనియున్నారు. 1) కొత్తపేట కరుణ గారు మల్లిన శ్రీనివాస్ గారి వద్ద కొనుగోలు చేసిన డాక్యుమెంట్ నెం. 1202/2007 తేది. 29-3-2007 2) మల్లిన శ్రీనివాస్ గారు యర్రంశెట్టి నాసరయ్య గారి వద్ద నుండి కొనుగోలు చేసిన డాక్యుమెంట్ నెం. 2305/2006, తేది. 8-5-2006. ఈ రెండు ఒరిజినల్ లింకు డాక్యుమెంట్స్ తేది. 1-2-2024 తేదిన జంగారెడ్డిగూడెం బస్టాండ్ సెంటర్లో జిరాక్స్ తీసుకొనుటకు వెళ్ళి చూసుకొనగా కనిపించియుండలేదు. తదుపరి ఎంత వెదికిననూ దొరకలేదు. కావున ఎవరికైననూ దొరికిన ఎడల క్రింది అడ్రస్కు తెలియజేయగలరు.

Sd/- **M.RAMAMOHAN RAO** B.Com., B.L.
ADVOCATE, Jangareddigudem
Cell: 94414 47739

In the Court of the Principal Junior Civil Judge, Tanuku

O.S. No. 367/2023

Between:
Borsu Veera Venkata Subrahmanyam ...*Plaintiff*
AND
Peddy Veera Venkata Satyanarayana ...*Respondent*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాది: రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, S/o. వీర రాఘవులు, హిందు, పురుషుడు, 55 సం॥లు, బిజినెస్, డో.నెం. 3-24/1, Canal Street, వేల్పూరు గ్రామం, తణుకు మండలం, తణుకు, ప॥గో॥జిల్లా.

పై నంబరు దావా గ్రంధములో మీరు ప్రతివాది అయి వున్నారు. మరియు I.A. No. 820/2023 నందు రెస్పాండెంటు అయి వున్నారు. పై నంబరు దావా గ్రంధము మరియు I.A. No. 820/2023 నందు శ్రీ కోర్టు వారి ఆదేశం ప్రకారం మీకు ఎన్నిసార్లు సమన్లు మరియు నోటీసులు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశం ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు ఈ ప్రకటన ప్రచురితమైన తేది నుండి 30 రోజులులోగా మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు ఎదుట హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేయవలసినదిగాను, అట్లు కాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

NEELAM HARISH NAIDU
Advocate, Tanuku
Cell: 9293222187